# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 39 సంచిక 6

పేజీలు 44

ఫిబ్రవరి 2020

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


శ్రీకృష్ణ కర్ణామృతము ....................................4

శ్రీబాబూజీ ఉవాచ.......................................... 5

అమ్మమాట.................................................. 7

రామాయణంలో స్త్రీ పాత్రలు .........................9

నూతన సంవత్సరం......................................12

భక్తి పారవశ్యం ...................... ...........................14

పూజ్యశ్రీ మాతాజీవారి సందేశం.............15

నైమిశారణ్య కార్యక్రమం ..................................17

యదార్థ భక్తి ......................................... ................ 19

పట్టుదల ........................ .. ......................... ......... ....21

సాధనే ముక్తికి మార్గం ............ ....................25

తిరుప్పావై .................. ................. . ........................27

గుర్వష్టకమ్ ..................................................29

భజ గోవిన్దమ్ ..................................................31

మీరేగా అంతా .. మీదేగా అంతా ...............32

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................33

పతితపావనుడు ............................................34

కైవల్యోపనిషత్ ... ............................................36

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38

విష్ణు కథలు ....... ........................ ...................41

# శ్రీ కృష్ణ కర్ణామృతము - సుశీలా ప్రసాద

**తృతీయాశ్వాసము - 100వ శ్లో॥**

**కదమ్బమూలే క్రీడన్తం । బృన్దావన నివేశితం ।**

**పద్మాసన స్థితం వన్దే వేణురాగయన్త మచ్యుతమ్ ॥**

తాత్పర్యము - కడిమి చెట్టు క్రింద ఆడుచున్నవాడును, బృందావన మందు పద్మాసనమందు కూర్చున్నవాడును పిల్లన గ్రోవితో పాడుచున్న శ్రీకృష్ణుని గురించి నమస్కరిస్తున్నాను.



చల్లనిగాలి వీస్తున్నది. అప్పుడే చిలికి తీసిన వెన్నముద్దలాగ వున్నాడు. ఆకాశంతో నిండు చంద్రుడు, ఆ వెన్నెలా చల్లగానే వుంది. గాలి కూడా చల్లగానే వుంది. అయినా శరీరమంతా తాపంగా వుంది. నిద్ర రావటం లేదు. లేచి నడక సాగించాను. అడుగులు బృందావనం కేసి వెళ్ళాయి. కాళ్ళు ఆగిన చోట చూస్తే కనుల విందుగా మురళీమోహనుడి రూపం కనిపించింది. కడిమి చెట్టు క్రింద పద్మాసనం వేసుకుని కూర్చుని మురళీ వాయిస్తున్నాడు. నా శరీర తాపం చల్లారింది. నేను చేరవలసిన చోటు ఇదే అనిపించింది మనస్సుకి. బ్రహ్మానందంలో లీనమైపోయింది నా మనస్సు. ఇదే జీవేశ్వరసంధానమేమో అనిపించింది.

1. పతితుడే భగవంతుడి సాహచర్యానికి ఎక్కువగా నోచుకుంటాడా?
2. శంకరాచార్యులవారు స్థాపించిన నాలుగు పీఠాలు ఏవి?
3. మహాత్ముల విశ్వాత్మ భావన ఎలా వుంటుంది?
4. ధ్యానంలో జరిగే మథనం ఏమిటి?
5. చెక్కెర అద్దిన చేదు మాత్ర ఏది?
6. నీకు ముక్తిని కలిగించేది ఏది?
7. మన పట్టుదల ఎలా వుండాలి?
8. చదువులలోని మర్మమెల్ల తెలియాలంటే ఏం కావాలి?
9. విభక్తిలేనిది ఏది?
10. ఎన్నో రూపాలు గల భగవానుని ఏ పేరుతో పిలవాలి?
11. మూర్ఖులకు సలహా ఇస్తే కలిగే ఫలితం ఎలా వుంటుంది?

***సమాధానాలు లోపలి పేజీలలో.........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

6-3-1980

ఈరోజు రాత్రి సుమారు 9గం॥లకు శ్రీబాబు దర్శనం ఇచ్చారు. అంతా కూర్చున్నాము. మేమంతా 'సత్సంగాలు నిర్వహించటం, బాబు ఉపన్యాసాలు ప్రచారం చేయటం ఎలా?' అనే విషయాల గూర్చి చర్చిస్తున్నాము. మా సంభాషణలో అనేక విషయాలు దొర్లాయి. వాటిలో ముఖ్యంగా సజ్జన సాంగత్యం గురించి వచ్చింది.



శ్రీ బాబు 'ఏమిటి విశేషాలు?' అని అడిగారు. తర్వాత బోధ చేశారు. 'సజ్జన సాంగత్యం చేయాలి. దుస్సాంగత్యం చేయటంవలన దుర్వ్యసనాలకు బానిస లౌతారు' అన్నారు శ్రీ బాబు.

'ఆధ్యాత్మిక చింతన లేనివారితో స్నేహం చేయరాదు. వారు ఎంత బంధువులైనా వారి ఇంట భోజనం కూడా చేయరాదు. ఆధ్యాత్మిక చింతన లేనివారికి గాని, మత్తుపానీయాలు త్రాగేవారికిగాని ఎటువంటి ధన సహాయం చేయకూడదు. అటువంటివారికి ధనాన్ని వడ్డీకి కూడా ఇవ్వకూడదు. మనం సహాయం చేసిన ధనం వారు దుర్వినియోగం చేస్తే పాతకం ధనం యిచ్చిన వాడికే చుట్టుకుంటుంది. దుర్జనులకు ఏ రకమైన సాయం చేసినా దాని ఫలితం సహాయం చేసినవాడికే తగులుతుంది. మూర్ఖులకు సలహా నివ్వరాదు. మంచివారితోనే స్నేహం చేయాలి. మంచినే ఆలోచించాలి. అలా చేయటం వలన మేధస్సు వృద్ధి చెందుతుంది. చెడును ఆలోచించటం వలన మేధస్సు తగ్గిపోతుంది. మంచి మనస్సుకలిగియున్న వారికి అందరిలోనూ మంచి మాత్రమే కనపడుతుంది. వారికి మహాత్ములైన గురుదేవులంటే అమిత భక్తి.

ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకొనటంలో ఆసక్తి ఉంటుంది.

విసుగుగా ఉండదు. దుర్జనులకు గురుదేవుని బోధనలోని అమృతం ఎలా తెలుస్తుంది ? మహాత్ముల మనస్సు తేనెవలె మధురమైనది. వారు ఎంతో ఆప్యాయత, ఆదరణ కనబరుస్తారు, వారి కర్తవ్యం సదా భక్తులకు తరించే మార్గం చూపటమే కదా. అయితే అట్టి మహాత్ములు చెప్పేమాటలు మూఢులు వింటారా ? కాబట్టి ఎన్నటికీ మూర్ఖులకు సలహా నివ్వరాదు. అలా ఇవ్వటం వలన మనమే నష్టపోతాము. మీకు ఒక చక్కని దృష్టాంతము చెప్తాను.

అరణ్యంలో ఒక కోతి, చిలక నివసిస్తున్నాయి. ఒకనాటి చలికాలం రాత్రి చలిబాధ ఎక్కువగా ఉంది. దానికి తట్టుకోలేక కోతి మిణుగురు పురుగుల్ని తీసుకువచ్చి ఆకులు పేర్చి మంటచేయ సంకల్పించింది. అయితే మిణుగురు పురుగులు ఎగిరిపోయాయి. మంట రాలేదు. కోతి విసుగు లేకుండా మిణుగురు పురుగుల్ని తీసుకురావటం, ఆకులు పేర్చటం మంట చేయ ప్రయత్నించటం, అది అలా అనేక పర్యాయాలు ప్రయత్నించింది.

ఆ చెట్టు మీదనే ఉన్న చిలక దీనిని చూసి 'ఓ నేస్తమా! మిణుగురు పురుగులతో ఎంత ప్రయత్నం చేసినా మంట రాదు. ఆ ప్రయత్నం కేవలం వృథా ప్రయత్నం. దూరంగా కనపడే ఆ గుడిసె వద్ద నిప్పు ఉంది. అది తీసుకువచ్చి మంటచేస్తే చలిబాధ పోతుంది' అని సలహా ఇస్తుంది.

దానికి కోతి ఆగ్రహంచెంది ఇంత చిన్న దానివి, అల్పురాలివి నాకు సలహా ఇవ్వటానికి నువ్వు ఎవ్వరవు? అని అక్కడనే ఉన్న ఒక రాయిని చిలకపైకి విసురుతుంది. దానితో ఆ చిలక చనిపోతుంది. మూర్ఖురాలైన కోతి చిలక చెప్పినది వినకపోగా, చిలకని చంపింది. చూశారా! మూర్ఖులకు సలహా యివ్వటం వలన మనకే నష్టం. కాబట్టి మీరంతా ఎంత జాగ్రత్తగా ఉండాలో ఆలోచించుకోండి!" అన్నారు.

(గత సంచిక తరువాయి)

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## సాధన ఎలా చేయాలి?

కానీ మాయకు లోబడిపోయిన మానవుడు అన్నీ చేస్తున్నాడు కానీ, గురునామ స్మరణ, గురువాక్యం మటుకు మరచిపోతున్నాడు. దానివలన కష్టాలకు గురయిపోతున్నాడు. గురుదేవులు నిర్హేతుక జాయమాన కరుణా కటాక్షం కలిగినవారు. ఒక్కసారి మనసారా 'బాబూ!' అని పిలిస్తే చాలు. పరుగు పరుగున వచ్చి రక్షిస్తారాయన! అది మనందరికీ అనుభవమే.



అలనాడు కురుసభలో ఆ ద్రౌపది రుక్మిణీ వల్లభా! ద్వారకా నాయకా! రక్షించవా!' అన్నది. కానీ ఆయన అప్పుడు దూరంగానే వున్నాడు. ఎప్పుడయితే ఆవిడ 'మమనాథా! హృదయ నివాసా!' అని ఎలుగెత్తి పిలిచేసరికి ఆయన అక్కడే వున్నాడు. మామగార్లు, తాతలు, తండ్రులు, ఐదుగురు భర్తలు ఎంతమంది వున్నా, ఆవిడని చివరికి ఎవరు రక్షించగలిగారు? కృష్ణుడు తన హృదయంలోనే వున్నాడు. భక్తుల హృదయంలో మంచి పక్క వేసుకుని వుంటాడాయన. బాబు ఎప్పుడూ మన వెనకే వుండి మనలను నడిపించేవారు. మనం తప్పు చేస్తే, తినవలసిన మొట్టికాయలన్నీ తిన్నాకనే చివరికి ఆయన వెనకనుండి వచ్చేవారు రక్షించడానికి. అందుకే కాబోలు ఈనాడు మన బృందావనంలో (ఎందుకు భయం? నేనుండగా!) WHY FEAR ? I AM HERE! అనే అభయముద్ర స్వామి వెనకాల ప్రకాశిస్తోంది!

ఏనాడయితే మనలోని మనో, బుద్ధి, చిత్త, అహంకారాలనే దుష్టచతుష్టయముని స్వామి చరణాలకి దాసోహమని శరణు పొందుతామో ఆనాడే అవి సత్యం, శాంతి, దయ, ప్రేమగా మారిపోతాయి.

మహాత్ముల బోధని ఒళ్ళంతా చెవులు చేసుకుని, పరిపూర్ణంగా మనసునుంచి జాగ్రత్తగా వినాలి. ఆ బోధ వలన మనలో విచారణ జరుగుతుంది. దాని ద్వారా భగవంతుడనేవాడు ఎక్కడో లేడు; మన

దగ్గరే, మనలోనే, మనమే అయివున్నాడు అని తెలుసుకోగలుతున్నాము. 'నేను ఎవరు?' ఈ పేరు, ఊరు కలిగిన ఫలానా వ్యక్తినా?' అని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకోవాలి.

అస్తి, జాయతే, వర్ధతే, పరిణమతే, అపక్షీయతే, నశ్యతే అనే షడ్భావ వికారాలు ఈ దేహానికే వున్నాయి. కానీ 'నేను' మారనటువంటి వాడిని. ఈ ఫలానే పేరనేది ఈ 'మేను'కి పెట్టారు. ఎందుకంటే అందరూ 'నేను నేను' అంటే గుర్తు తెలియదు కనుక. గుర్తుకోసమని ఫలానా పేరని పెట్టారు. అంతేకాదు, 'నీ పేరు సార్థకం చేసుకోరా' అని మన పెద్దలు, పూర్వం భగవంతుడి పేర్లు పెట్టేవారు. ఇప్పుడు సరేలెండి! రకరకాల పేర్లు పెట్టుకుంటున్నారు. ఈ 'మేను నేననేది మరపింపజేసి, 'బ్రహ్మమే నే'నని తెలుపుతుంది తత్త్వం. అయితే ఏనాడూ కూడా 'నేను గురుదేవుడంతటి వాడిని' అన్నమాట రాకూడదు. అది వచ్చిందో! ఇక అంతే! సముద్రమంత పాలలో ఒక్కచుక్క మజ్జిగ పడినట్లుగా సర్వనాశన మయిపోతాడు.

-సశేషం

**సమర్థ సద్గురు మాసపత్రిక పాత ప్రతులను ఆన్‌లైన్‌లో చదవడానికి మీ స్మార్ట్‌ఫోన్‌తో ఈ ప్రక్కన ఇవ్వబడిన QR CODE స్కాన్ చేయండి.**

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించుకొనవలసినదిగా విజ్ఞప్తి.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

## ఊర్మిళాదేవి

- సుషుమ్నా ప్రసాద

ఊర్మిళాదేవి అత్తకు తగ్గ కోడలనిపించుకొన్న ధన్యురాలు! ఊర్మిళ రామాయణ మహాకావ్యంలో వుపేక్షింప బడినదని కొందరి అభిప్రాయము. సీత పాత్రపై వుండే మక్కువతో ఊర్మిళను ఉదాసీనంగా చూశాడని, విశ్వకవి రవీంద్రుని అభిప్రాయము. ఎవరేమనుకున్నా, ఉదాత్తమైన ఊర్మిళ పాత్రను మన ఊహకే వదిలివేశారు వాల్మీకి మహర్షి. ఆమె జనక మహారాజు పుత్రిక, లక్ష్మణుని అర్ధాంగి. ఇక ఊర్మిళ మహాసాధ్వి కాకుండా ఎలా వుంటుంది?

ఊర్మిళ పాత్రను మహర్షి అలా స్పృశించి వదిలివేసినా, ఊర్మిళాదేవి మన ఊహకందని త్యాగమయి, ధన్యజీవి! లక్ష్మణుడు వనవాసం వెళ్ళే విషయాన్ని చెప్పడానికి, ఊర్మిళ మందిరానికి వెళ్తాడు. ఆమె గొప్ప కళా తపస్వి. చిత్ర లేఖనములో అందెవేసిన చేయి. లక్ష్మణస్వామి వచ్చేసరికి ఆమె శ్రీరామ పట్టాభిషేకము చిత్రము గీయటంలో నిమగ్నమై వున్నది. భర్త వచ్చాడనే ఆనందముతో లేవబోయేసరికి, ఆ రంగులన్నీ ఒలికిపోయాయి. అయ్యో! ఇలా జరిగిందేమిటని గాబరా పడుతుంటే, ఏమి జరిగిందని లక్ష్మణుడు ప్రశ్నించేసరికి ఊర్మిళ రంగులు ఒలికిపోయాయని చెప్పింది. అప్పుడు లక్ష్మణుడు మాట్లాడుతూ 'కైకేయి మహాతల్లి వలన పట్టాభిషేకము పాడయి పోయిందని, తన రాక వలన చిత్రం పాడైందనే చింత అవసరం లేదు' అని చెబుతాడు. వెంటనే ఊర్మిళను నిశ్చేష్టురాలిని చేసే అశనిపాతం లాంటి వార్త చెప్పాడు. 'ఊర్మిళా! సీతారాములు వనవాసానికి వెడుతున్నారు. వారికి సేవ చేయడానికి నేను కూడా వనవాసం వెడుతున్నాను. పద్నాలుగు సంవత్సరాల తరువాత మాత్రమే కనబడతాను' అని ముక్తసరిగా వీడ్కోలు చెప్పాడు. ఊర్మిళ నిశ్చేష్టురాలు అయింది. నేత్రాలు భాష్పపూరితమయ్యాయి. మాటలు బయటకు రాలేదు.

ఆమెను ఓదార్చటముకాని, నాతో వస్తావా అని అడగటంకాని, అత్తమామలకు సేవచేయమని నిర్దేశించటం గాని, ఈ లోపల సీతారాముల దర్శనం చేసుకోమని చెప్పడం కాని ఏమీ చేయలేదు

లక్ష్మణుడు. సీతారాముల సేవ చేసుకోవడానికి వెడుతున్నానని చెప్పిన మాట ఊర్మిళ గొంతును ఒక్క మాట బయటకు పెగలనీయలేదు. కొంతసేపటికి తెప్పరిల్లి ఊర్మిళ 'సీతారాముల సేవ చేసుకోవడానికి వెడుతున్నాను అన్నారు మీరు. నన్ను గురించిన ఒక్క ఆలోచన కూడా ఈ పద్నాలుగు సంవత్సరాలూ మీ మనస్సులోకి రానివ్వకండి. అలా వస్తే, అక్కడ మీ సేవకు అంతరాయం కలుగుతుంది. అలా వస్తే మీరు అక్కడ, నేను ఇక్కడ ఏమి చేయగలము?' అన్నది.

పధ్నాలుగు సంవత్సరాలు ఊర్మిళ నిద్రించింది అంటారు. కానీ అది వాస్తవం కాదు. ఆమె మహాతపస్విని. ఆ పధ్నాలుగు సంవత్సరాలు ప్రపంచానికి విలక్షణంగా, ఆమె విదేహరాజు పుత్రిక కాబట్టి యోగముద్రలో నిలిచి పోయింది. అంతటి త్యాగమయి, మహాసాధ్వి గురించి ఏమి వ్రాయగలరు? ఆమె చరిత్రకందని త్యాగమయి. అందుచేతనే తులసీదాసు వంటి మహాత్ముడు 'తల్లీ! నీ చరిత్ర వ్రాయగల శక్తి నాకు లేదు. నీకు వందనం చేయటం కన్న మరేమీ చేయలే'నన్నాడు. రామరావణ యుద్ధ సమయంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు హనుమంతుడు సంజీవిని తెచ్చేటప్పుడు నందిగ్రామములోని భరతుని వద్దకు వెడతాడు. అందరూ లక్ష్మణుని మూర్ఛ వార్త విని ఖిన్నులవుతారు. ఒక్క ఊర్మిళాదేవి మాత్రం తన మందిరంలో ప్రశాంతంగా కూర్చుని వుంటుంది. హనుమంతుడామెను ఆశ్చర్యంగా ప్రశ్నిస్తాడు 'ఈ వార్త విని అందరూ తమ మాంగళ్యానికి ముప్పు వాటిల్లుతుందని భయపడుతుంటే తమరు ఇంత ధైర్యంగా ఎలా వుండగలిగారమ్మా?' అని.

అప్పుడు ఊర్మిళ చిరునవ్వుతో 'నా భర్త రామసేవా దురంధరుడు. రామభక్తి పరాయణుడు. లక్ష్మణస్వామి ప్రతి రోమము రామనామముతో ప్రతిధ్వనిస్తుంది. ఆయనలోని ప్రతి మాంసాణువు కూడా రామనామమంత్ర మాంసాణువు మాత్రమే. నా భర్త సిరలలో, ధమనులలో ప్రవహించేది రామరసమే కాని, రక్తము కాదు. అందుచేత శత్రు శరపరంపర ఆయనకెట్టి ఆపదను కలగనీయవు' అని నిర్ద్వందంగా, దృఢంగా చెప్పింది.

యుద్ధరంగంలో నా భర్త ఎలా వున్నాడని హనుమను ప్రశ్నిస్తుంది. 'ఆయన మూర్ఛపోయి ప్రశాంతంగా నిద్రిస్తున్నట్లున్నాడు.

రామచంద్రుడు అశ్రుపూరిత నేత్రాలతో దుఃఖితుడై వున్నాడు' అని హనుమ చెబుతాడు. అప్పుడు ఊర్మిళ 'చూశారా! రామనామంతో, రామనామ రసంతో పునీతమైన ఆయన శరీరాన్ని ఒక్క బాణము కూడా బాధించలేదు. అందుచేతనే ప్రశాంతంగా నిద్రిస్తున్నాడు. ఆ శరపరంపర బాధనంతా రామచంద్రుడే భరిస్తున్నాడు' అని చెబుతుంది. ఆ విశ్లేషణకు ఆశ్చర్యపోయాడు ఆంజనేయుడు!

ఆ తరువాత హనుమ తాను సూర్యోదయానికి పూర్వమే ఈ సంజీవిని తీసుకు వెళ్ళి యుద్ధరంగంలో వున్న లక్ష్మణుని ప్రాణాలను మూర్ఛనుండి తెప్పరిల్లేటట్లు చేయాలి అని చెబుతాడు. అది విని ఊర్మిళ 'ఇనకుల దీపకులను రక్షించడం సూర్యభగవానుని బాధ్యతే కదా. నీవు యుద్ధభూమి చేరేదాకా సూర్యోదయము కాదు' అని ఆమె దృఢంగా చెప్పింది. ఆ సాధ్వీమతల్లికి వాక్శుద్ధి వుంది. అత్త సుమిత్రకు దీటుగా నిలబడగల విరాగిణి, స్థితప్రజ్ఞురాలు ఊర్మిళాదేవి.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2020

5 బుధ - భీష్మ ఏకాదశి - శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా వార్షికోత్సవం. శ్రీసద్గురు పాదపూజ.

5-2-2020 నుండి 9-2-2020 వరకు పూజ్యశ్రీ మాతాజీ వారి సత్సంగ సమావేశములు.

9 ఆది - మాఘపూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

18 మంగళ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

21 శుక్ర - మహాశివరాత్రి - శ్రీసద్గురుపాదపూజ

**మార్చి 2020**

9 సోమ - పౌర్ణమి - హోళీ - శ్రీసద్గురుపాదపూజ.

18 బుధ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

25 బుధ - శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది. శ్రీసద్గురుపాదపూజ.

# నూతన సంవత్సరం - సుషమ్నా ప్రసాద

మనం 2019వ సంవత్సరానికి వీడ్కోలు చెప్పి, నూతన సంవత్సరం 2020ని స్వాగతిస్తూ, కొత్త దశాబ్దిలో అడుగు పెట్టాము. ప్రపంచమంతా జరుపుకొనే ఈ ఆంగ్లమాన సంవత్సరాలు భగవాన్ ఏసుక్రీస్తు జననం నుండి ప్రారంభమై ఇప్పుడు 2020లో ప్రవేశించాము. మనం దేన్ని స్వాగతిస్తున్నాము, దేనికి తిలోదకాలు ఇస్తున్నామనేది ప్రతి ఆధ్యాత్మిక సాధకుడు తన్ను తాను ప్రశ్నించుకోవాలి.

ఒక్క ఆంగ్లమానంలోనే కాక మన దేశంలో భాషాపరంగా, రాష్ట్రపరంగా అనేక నూతన సంవత్సరాలు జరుపుకుంటాము. మనం లోతుగా ఆలోచిస్తే కాలమనేది అనంతం. 'కాలం కలయతామహం' అని భగవద్గీతలో చెప్పినట్లు కాలం భగవత్స్వరూపం. సముద్రంలో కెరటాల లాగా జీవులన్నీ ఈ కాలంలో వచ్చిపోతుంటాయి. పైపై కెరటాలతో సముద్రపు లోతును తెలుసుకోవడం అసాధ్యం. అందువలన మానవుడు జనన మరణాదులనే పరిధిలో, జీవన రంగస్థలిలో నటించే నటునితో పోల్చుకోవాలి. మానవుని జ్ఞానము, విజ్ఞానము పరిమితమైనవి. అనంత శక్తి సంపన్నుడైన భగవానుడు (గురుదేవుడు) ఈ జీవిత నాటకానికి సూత్రధారి. మానవులంతా పాత్రధారులే. కర్మానుసారం భగవంతుడు ఏ పాత్రధారిని ఎలా నటించమని నిర్దేశిస్తే, అలా నటించాలి. అప్పుడే ఆ పాత్రకు సాఫల్యత.

అంటే భగవంతుడనే సూత్రధారి నిర్దేశించిన ప్రకారం మానవుడు ప్రవర్తిస్తే అతని జీవితం సార్థకమై, నిత్యనూతనంగా ప్రకాశిస్తాడు. మనం ప్రగాఢంగా విచారిస్తే ఏది నూతనం? ఏరోజుకారోజు మారేది, నిలకడ లేనిది నూతనం కాదు. దేనికి మార్పు లేకుండా నిత్యనూతనంగా ప్రకాశిస్తుందో అదే శాశ్వతమైన నూతనత్వం. కాలం చేతిలో బంధితుడైన మానవుడు కాలానికి కీలుబొమ్మేకాని, కాలం ఎప్పుడూ మానవుడికి లొంగదు.

క్రీస్తుశకము, శాలివాహన శకము, విక్రమార్క శకము ఇలా కాలాన్ని అనేక రకములుగా విభజించి, మానవుడు నూతన సంవత్సర ప్రారంభాన్ని నిర్ణయించుకుంటాడు. ఎందుకంటే కాలం ఎప్పుడు ప్రారంభం

అయిందో ఎవరు నిర్ణయించగలరు? మధ్యలో వచ్చి, మధ్యలో పోయే మానవుడు మిథ్యలోనే వుంటాడు. మిథ్యా రహితుడై ఆద్యంతములు లేని భగవానుని (గురుదేవుని) ఆశ్రయించినవాడే నిత్యానందమును పొంది నిత్య నూతనంగా వుంటాడు.

అన్నిటికంటే అమూల్యమైనది కాలం. పోయిన సంపదలను తిరిగి పొందే అవకాశం వున్నదికాని, గడిచిపోయిన కాలాన్ని తిరిగి పొందలేము. కాలం మనకు జీవితాన్ని సార్థకం చేసుకోమని ఒక్కొక్క రోజును కానుకగా ప్రసాదిస్తుంది. రోజులో వున్న 86,400 సెకన్ల సమయాన్ని మనం సద్గురు స్మరణ, ఆరాధన, సేవానిరతికి వినియోగిస్తే మనం తప్పక తరిస్తాము. భగవంతుడు ప్రసాదించిన ఈ అమూల్యమైన ధనాన్ని ఏరోజుకారోజే సద్వినియోగం చేసుకోవాలి, కాని మరుసటి రోజుకి దాచుకోవడానికి ఆస్కారం లేదు. అందువలన ఆధ్యాత్మిక సాధకుడు నిత్యజాగరూకుడై సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అందుచేత నూతన సంవత్సరంలో ప్రవేశించేటప్పుడు ప్రతివారూ అమూల్యమైన ఆ వార్షిక కాలాన్ని సదాశివ స్మరణ, సంఘసేవ, భగవత్సేవకే వినియోగం చేస్తామని దృఢనిశ్చయం చేసుకోవాలి. అప్పుడే నూతన సంవత్సరంలోని నూతనత్వాన్ని మనం ఆస్వాదించగలము.

2020 అంటే మనం కొత్త దశాబ్దపు తొలిసోపానంలో వున్నాము. సంఖ్యాపరంగా చూస్తే 2 ద్వైతమునకు ప్రతీక. 0 పరిపూర్ణత్వాన్ని సూచిస్తుంది. అంటే మనం ద్వైతానికి వీడ్కోలు చెప్పి, పరిపూర్ణత్వాన్ని స్వాగతించాలి. రెండవ 20 ద్వైతమును అధిగమించినవాడు తప్పక పరిపూర్ణత్వమును సాధిస్తాడని నొక్కి వక్కాణిస్తోంది. అంతేకాక, 20 సంవత్సరాలు అంటే వినూత్న యౌవనమునకు సంకేతం. అందువల్ల 2020లో ఆధ్యాత్మిక సాధకులైనవారందరమూ పరువంలోని ఉత్సాహం, ఉద్రేకము, నిరంతర కృషి, పట్టుదలతో పరిపూర్ణత్వమును సాధించడమే మన జీవిత ధ్యేయంగా భావిద్దాము. ఈ నూతన వార్షికములో శ్రీ సద్గురుమూర్తి అనుగ్రహము, సదాశివ సేవ పుష్కలంగా లభించి నిత్యనూతనంగా వర్ధిల్లాలని ఆశిస్తూ, ప్రార్థిస్తూ .......మీకివే నూతన సంవత్సర శుభాకాంక్షలు!

# భక్తి పారవశ్యం

- బొంబాయి కృష్ణారావు

ఒకసారి భారత యుద్ధానంతరం శ్రీకృష్ణుడు, అర్జునుడు ద్వారకకు వెళ్ళారు. ఈసారి అర్జునుడు రథం నడిపాడు. ద్వారక చేరగానే అలసిపోవడం వలన అర్జునుడు విశ్రాంతి కోసం అతిథి గృహానికి వెళ్ళిపోయాడు. రుక్మిణీ దేవి కొద్దిసేపటికి కృష్ణుడికి భోజనం వడ్డించటం మొదలుపెట్టింది. 'అతిథి వున్నప్పుడు అతను లేకుండా ఎలా తినగలను?' అన్నాడు కృష్ణుడు. 'నేను పిలుచుకుని వస్తాను. మీరు మొదలు పెట్టండి' అని రుక్మిణి అర్జునుడిని పిలవడానికి వెళ్ళింది. తీరా వెళ్ళి చూస్తే, అక్కడ నిద్రలో వున్న అర్జునుని ప్రతి రోమం లోనుండి కృష్ణ నామం ప్రతిధ్వనిస్తోంది. నిద్ర లేపటం మరచి రుక్మిణి తాళం వేయసాగింది.

అక్కడ నారదుడు 'స్వామీ! భోజనం చల్లారిపోతోంది' అన్నాడు. 'అతిథి లేకుండా నేను తినను' అన్నాడు కృష్ణుడు. 'నేను తీసుకు వస్తాను' అని నారదుడు కూడా బయలుదేరాడు. అక్కడ పరిస్థితి చూసి, నిద్ర లేపడం మరచి నారదుడు వీణ వాయించడం మొదలుపెట్టాడు. సత్యభామ కృష్ణుడితో 'అన్నం చల్లారిపోతోంది. మొదలు పెట్టండి, నేను వెళ్ళి పిలుచుకు వస్తాను' అన్నది. 'అతిథి లేకుండా నేను భోజనం చెయ్యలేను' అన్నాడు పరమాత్ముడు. ఆమె కూడా వెళ్ళి చూసి, వచ్చిన పని మరచి తాను నృత్యం చేయడం మొదలు పెట్టింది.

ఇక్కడ భోజనం చల్లారిపోతోంది. నా గోల ఎవరూ పట్టించుకోవడం లేదు. పిలవడానికి వెళ్ళినవారు తిరిగి రారు. అక్కడ ఏమి జరుగుతోందో చూద్దామని కృష్ణుడు స్వయంగా బయలుదేరాడు. అక్కడ స్వరలహరి జరుగుతోంది. అర్జునుడు నిద్రలో కీర్తన చేస్తున్నాడు. రుక్మిణి తాళం వేస్తోంది. నారదుడు వీణ వాయిస్తున్నాడు. సత్యభామ నృత్యం చేస్తోంది. ఇది తిలకించిన కృష్ణుని నేత్రాల నుండి ఆనందాశ్రువులు జాలువారాయి! అర్జునుడి పాదాలను వత్తడం మొదలు పెట్టాడు. ఎప్పుడైతే అర్జునుడి పాదాలను ప్రేమాశ్రువులు స్పృశించాయో వెంటనే లేచి, 'ప్రభూ! ఏమి చేస్తున్నారు?' అన్నాడు. 'అర్జునా! నువ్వు నన్ను ప్రతి రోమంలోనూ, కణం లోనూ నిక్షిప్తం చేసుకున్నావు. అందుకని నువ్వు నా భక్తాగ్రేసరుడవు' అని గోవిందుడు అర్జునుని గాఢాలింగనం చేసుకున్నాడు.




- రమణ ప్రసాద్

# పూజ్యశ్రీ మాతాజీ వారి సందేశం

శ్రీగురుదేవుల పరమానుగ్రహంతో మనం 2019కి వీడ్కోలు ఇచ్చి 2020కి అడుగు పెట్టాం. మనం కాలంలో ఉన్నాం కాబట్టి ఇలా అంటున్నాం. ఈ కాలాన్ని ప్రసాదించినది “కాలజ్ఞాన విదగ్రణి ” అయిన శ్రీగురుదేవులే. ఎవరు ఎంతవరకు స్వామిని ఆరాధిస్తున్నామో వారు తమ ప్రాప్త్యానుసారం అనుభూతిని పొందుతున్నారు. అది వారి వారి పాత్రలను బట్టి ఉంటుంది.

మనం సహస్రనామాలు చదువుతాం. కాని ఏ ఒక్కనామం పైనైనా మన మనస్సు నిలిచిందా, తదనుభూతిని పొందామా? అని మనం బేరీజు వేసుకోవాలి. “ఓం నమో భగవతే కాళీ ప్రసాదాయ” అనుకుంటే ఆ స్వామి వికసిత వదనం, వారి అభయహస్తం మన మనోఫలకంలో నిలిచిపోవాలి. ఆ దివ్య చరణాలపై మనోపుష్పం పెట్టాం. వారు ఆ పుష్పాన్ని తిరిగి మన చేతిలో పెట్టి ఆశీర్వదిస్తారు.

**“ఉద్ధరేదాత్మనాఽఽత్మానం..”** అని జగద్గురువైన శ్రీకృష్ణుడు చెప్పినట్లు ఎవరికి వారే ఉద్ధరించుకొనే ప్రయత్నం చేయాలి. భగవన్నామంపై మనస్సు నిలవాలంటే ధ్యానం చేయాలి. మనస్సును ప్రాపంచిక విషయాలపైనుండి మళ్లించి పరమాత్మవైపు తిప్పాలి. “నీ హృదయబాబు” అన్నారు శ్రీబాబు. మనస్సులో కోరికలు రహితమైతే నీ హృదయంలో శ్రీబాబు దివ్య కాంతులతో ప్రకాశిస్తారు.

మానవుడు ప్రతి సంవత్సరం ,“నా పుట్టిన రోజు, నాకు ఇన్నేళ్ళు వచ్చాయి” అని మురిసిపోతాడు. కాలగమనంలో ఈ దేహం నశించేదే అని విచారణ చేయడు. దేహం పోయినా మనలో నశించనిది ఒకటి ఉంది. అదే పరమాత్మ వస్తువు. విద్యుత్తుతో నడిచే లైటు, ఫ్యాన్ పాడైపోవచ్చు. కాని కరెంటు ప్రవహిస్తూనే ఉంటుంది. దానికి కాలమానంతో పని లేదు. అలాగే మనందరిలో కృష్ణ పరమాత్మ

ప్రకాశిస్తున్నాడు. ఆయన వయస్సును లెక్కపెట్టగలమా? ఆయన ఎన్నో మహత్కార్యాలు చేశాడు. ఎన్నో లీలలు చేసి ధర్మాన్ని నిలబెట్టాడు. అయినా, మన మనస్సులో నిలిచిపోయేవాడు ఆ చిన్ని బాలకృష్ణుడే. ఆయన ద్వాపర యుగంవాడైనా ఆయనను తలిస్తే మనం ఆ దివ్యానుభూతిని పొందుతున్నామా, లేదా!

కాలం వ్యవహారానికే. మనం చేసే ప్రతి సేవ 'నా గురుదేవులే చేయిస్తున్నారు' అనే అర్పిత భావంతో చేయాలి. మనం వారి చేతిలో వున్నాం. మనది "మార్జాల కిశోర న్యాయం" పిల్లి తన పిల్లలని ఏ విధంగా నోట కరుచుకుని సురక్షిత ప్రాంతానికి చేరుస్తుందో, అదే విధంగా శ్రీగురుదేవులు మనలను చేయి పట్టుకొని నడిపిస్తున్నారు. వారి అనుగ్రహంవల్లనే మనం జీవించ గలుగుతున్నాం. ఆయనను మనం మనసా వాచా కర్మణా నమ్మి కొలవాలి. మనస్సు నిర్మలం చేసుకోవాలంటే మనస్సును అంతర్ముఖం చేయాలి. భగవత్ప్రాప్తి కోసం ఆవేదన చెందాలి. నిన్ను నీవు తెలుసుకొన్నప్పుడే అందరిలో పరమాత్మను దర్శించ గలుగుతావు. ఇన్ని సంవత్సరాలుగా మనం గురు సన్నిధిలో గడపగలిగామంటే అది వారి కృప!

సంఖ్యా పరంగా చూస్తే 2019లోని అంకెలు కూడితే 3 వస్తుంది. 2020 అంటే 4 వస్తుంది. 3 అంటే త్రికరణ శుద్ధిగా సనాతన ధర్మం ఆచరించి, 4 అంటే మనస్సు చిత్తం బుద్ధి అహంకారాలతో కూడిన అంతఃకరణను శుద్ధి చేసికోవాలి. అప్పుడు భగవంతుడు మనను విడిచిపెట్టకుండా మోక్షం అనే గమ్యస్థానానికి చేరుస్తాడు. మోక్షం ఎక్కడోలేదు. నీ శరీరంలో జ్వరం వస్తే ఎలా అనుభవిస్తావో అలా అనుభవించాలి, అదే "పరమాత్మానుభూతి".

శ్రీ గురుదేవులు ఇక్కడ తిరుప్పావై, ఋషుల చరిత్రలు, ముకుందమాల, శ్రీ భాగవత ప్రవచనము ఏర్పాటు చేసి తమ సన్నిధిలో మనని ఉంచుతున్నారు. ఎంత విన్నా మనకి తనివి తీరటం లేదు. ఈ అనుభూతి మన జీవితాలకు మూలం. ఇది మనలను ఉద్ధరించే మార్గంలో నడుపుతుంది. మనందరికి అట్టి శక్తిని భక్తిని, ఆత్మానందాన్ని, ఆ జగన్నాధుడు, గురునాధుడు ప్రసాదించెదరుగాక సుఖీభవ!

# నైమిశారణ్యములో భాగవత సప్తాహం హరేరామ నామ సంకీర్తన

కలియుగ ప్రారంభంలో మునులందరూ బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి తపస్సు చేసుకోవడానికి భూమిమీద కలిప్రభావం లేని ప్రదేశం చూపించమని కోరగా, బ్రహ్మ మనోమయ చక్రమును సృష్టించి, 'ఇది ఎక్కడ ఆగితే అక్కడ కలిప్రభావం వుండదు' అని చెప్పి పంపించాడు. ఆ చక్రము విశ్వమంతా తిరిగి వచ్చి, గోమతి నదీ తీరం వద్ద ఆగిపోయింది. బ్రహ్మదేవుడు చెప్పినట్లుగానే ఆదిశక్తి లలితాదేవి మనోమయ చక్రమును అంతటితో ఆపివేసినది. ఆ ప్రదేశమే నేటి చక్రతీర్థము. ఆ పరిసర ప్రాంతమే నైమిశారణ్యం. ఆ చక్రం పడినప్పుడు కలిగిన వత్తిడికి కుండము ఏర్పడి భూమి నుండి నీరు పెల్లుబికి వచ్చింది. ఈ చక్రతీర్థములో స్నానం ఆచరించినవారి పాపాలన్నీ తొలగిపోయి, సర్వశుభములు కలుగుటయే కాక, సర్వతీర్థముల యందు స్నానమాచరించిన ఫలితం కలుగుతుంది.

గోమతీ తీరంలో వున్న ఈ నైమిశారణ్యం (లక్నోకు సుమారు 90 కి.మీ) పురాతన కాలం నుంచి వేలాది సాధు మహాత్ములు తపం ఆచరించిన పవిత్ర ప్రదేశం. ఇది అష్టమ వైకుంఠంగా చెప్పబడింది. 33 కోట్ల దేవతలు, మూడున్నర కోట్ల దేవస్థానములు, 84వేల మంది జ్ఞానులు ఇక్కడ నివశిస్తారని ప్రతీతి. ఇది భాగవతులకు అతి పురాతన పుణ్య క్షేత్రం, మరియు దివ్య ప్రదేశం. యుగారంభంలోనే నైమిశారణ్యం వెలిసింది. ఇక్కడ సాధన చేసిన మునులకు దివ్యదర్శనములు కలిగాయి. ఆధ్యాత్మిక జ్ఞాన సంపద ఇక్కడ నుండే ప్రవహించి అందరికీ చేరింది. ఇది సూతమహర్షి అష్టాదశ పురాణాలను వినిపించిన ప్రదేశం. ఈ అరణ్యంలో దాదాపు 84వేల మంది మునులతో శౌనక మహర్షి సమావేశమై భాగవత పారాయణం చేశాడని చెబుతారు. శ్రీ సత్యనారాయణ వ్రత విధానం కూడా మొదట సూతమహాముని శౌనకాదులకు ఇక్కడే వివరించాడు. వేదవ్యాసుడు మహాభారతం ఇక్కడే రచించినట్లు తెలుస్తోంది.

నైమిశారణ్యంలో భాగవత శ్రవణము, జపతపాదులు, యజ్ఞ యాగాదులు చేసిన వారికి సర్వపాపములు నశించి సకల భోగ

భాగ్యాలు సిద్ధిస్తాయని ప్రతీతి. మహాశివుడు రుద్ర తాండవానంతరము చల్లదనం కొరకు గోమతీ నదిలో ప్రవేశించి తపస్సమాధిలోకి వెళ్ళాడు. ఆ ప్రదేశము రుద్రావర్తకుండముగా పేరుగాంచింది. ఆ కుండంలో సమర్పించిన బిల్వదళములు మహాశివుడు కుండము అడుగు భాగానికి ప్రీతితో స్వీకరించగా మిగిలిన పండ్లు వంటివి నీటిలో తేలి ప్రవాహంలో వెళ్ళిపోతాయి. రుద్రావర్తము నైమిశారణ్యమునకు సుమారు 4కి.మీ దూరంలో వున్నది.

శ్రీ హరేరామ నామ సంకీర్తన సప్తసప్తాహాలు వైభవంగా జరుపుకున్న తరువాత ఇటువంటి పవిత్ర ప్రదేశంలో కూడా సంకీర్తన సప్తాహం చేసుకోవాలని ఆశ్రమ భక్తులు కోరిన మీదట భాగవత ప్రవచన సప్తాహ సహితముగా హరేరామనామ సంకీర్తన సప్తాహం ది.26-2-2020 బుధవారం నుండి ది. 4-3-2020 బుధవారం ఉదయం వరకు నైమిశారణ్యం (శ్రీ త్రిశక్తి దివ్య ధామం, ఆంధ్రా ఆశ్రమం)లో జరుపుకొనుటకు పూజ్యశ్రీ యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాదమాతాజీవారు అనుమతిచ్చారు. ఈ కార్య క్రమంలో ఆశ్రమ భక్తులు అన్ని ప్రదేశముల నుండి పాల్గొననున్నారు.

వివరములకు.. 93465 35357, 93983 34345 సంప్రదించగలరు.

**చందాదారులకు విజ్ఞప్తి**

*మేము పంపించిన సమర్థ సద్గురు మాసపత్రిక ప్రతులు కొన్ని తరచుగా మాకు తిరిగి వస్తున్నాయి. కాబట్టి దయచేసి పుస్తకం వెనకాల ముద్రించిన మీ చిరునామా సరిచూసుకోగలరు. ఏవైనా మార్పులు చేర్పులు వున్నట్లయితే మొదటిపేజీలో వున్న మా ఫోన్ నెంబరుకు ఫోన్‌చేసి మార్పించుకోగలరు. మేము ప్రతినెలా 5, 6 తేదీలలో పుస్తకాలు పోస్ట్ చేస్తాము. 15వ తేదీలోగా మీకు పుస్తకం చేరనట్లయితే ముందుగా మీ పోస్టాఫీస్‌లో సంప్రదించి, తరువాత మాకు తెలియజేయగలరు! దయచేసి మీ బంధుమిత్రులకు కూడా ఈ సమాచారాన్ని అందజేయగలరు!!*

## యదార్థ భక్తి

- గాలి జగదీశ్

ఒక రాజ్యంలో రాణీగారు చాలా భక్తి ప్రపత్తులు కలిగిన వంశంలో నుండి వచ్చిన సంస్కారవంతురాలు. ఎప్పుడూ పూజలు, పునస్కారాలు, వ్రతాలు ఇలా .... వుండేది. ఆ రాజుగారు మటుకు ఎప్పుడూ వ్యవహారంలో మునిగి తేలుతూ వుండేవాడు. ఆధ్యాత్మిక విషయంలో ఆసక్తివున్నట్లుగా కనబడేవాడు కాదు. కానీ ఈ రాణిని మటుకు ఎట్టి అభ్యంతరం పెట్టేవాడుకాదు. రాణి మాత్రం ఆయన ఉదాసీనతకు మనస్సులో చాలా నొచ్చుకొనేది.

ఒకనాడు రాత్రి రాణి హఠాత్తుగా నిద్రలేచింది. ప్రక్కనే నిద్రిస్తున్న భర్తముఖాన్ని పరిశీలనగా చూసింది. ఆయన ముఖం ఎంతో ప్రశాంతంగా వుంది. కాని ఆయన పెదవులు కదులుతున్నాయి. ఏమిటా అని ఆమె చెవులు రిక్కించి విన్నది, 'రామ్! రామ్' అనే జపం సాగిపోతోంది ఆయన పెదవులమీద. రాణి ఆనందానికి హద్దులులేవు. తన భర్తకూడా భక్తి కలిగినవాడే అని పొంగిపోయింది.

వెంటనే లేచి బయటకు వచ్చి మంత్రులను పిలిపించి, రాజుగారు నిద్రలేవక ముందే రాజ్యమంతా చాటింపు నిర్వహించమన్నది. అంతే! రాజుగారి భక్తి గురించిన వార్త నగరమంతా వ్యాప్తి చెందింది. నగరమంతా ఉత్సవ వాతావరణం వచ్చేసింది. ఎక్కడ చూసినా, మేళతాళాలు, గుంపులు గుంపులుగా జనులు చేరి చర్చించుకోసాగారు. రాజు నిద్ర లేవగానే, 'ఇలా ప్రచారం చేయించాను' అని రాణి చెప్పింది. అది విని రాజు నిశ్చేష్టుడై, తెలివితప్పి పడిపోయాడు.

కొంతసేపటికి ఉపచారాల ద్వారా రాజు తెలివితెచ్చుకుని, రాణిని చూస్తూ 'ఎంతపనిచేశావు మహారాణీ! భక్తి అనేది ప్రదర్శన కొరకు కాదు. అది హృదయాంతరాళాలలో భగవంతుని కొరకై సాగే ప్రేమపూర్వక తపన! ఆ తపన కేవలం ఆత్మేశ్వరుని కొరకు మాత్రమే' అన్నాడు.

రాణి ఈ నిర్వచనం విని ఆశ్చర్యంతో 'ప్రభూ! భక్తి అనగా ఎలుగెత్తి నామసంకీర్తన చేయాలనీ, లజ్జ, సంకోచము విడిచిపెట్టి నృత్యం చేయాలని, సద్గోష్టి చేయాలని మహాత్ములు చెబుతారు కదా! మహాత్ములంతా మరి అలా చేసినవారే కదా?' అని ప్రశ్నించింది.

దానికి రాజు సమాధానం చెబుతూ 'దేవీ! అలా చేయాలని

ఎక్కడా విధింపబడలేదు. అది ప్రాథమిక అభ్యాసకుల కోసం చెప్పబడిందని గ్రహించాలి. ఒకవేళ మహాత్ములు ఎవరైనా అలా ప్రవర్తిస్తే, అది వారు కావాలని ప్రదర్శన కోసం చేసినది కాదు. అవి వారి సహజమైన చేష్టలు, భక్త్యావేశంలో, తెలియని స్థితిలో వారు మైమరచిపోయి చేసినవే! అసంకల్పితమైనవే! భక్తిలో ఆ లక్షణాలను అనుకరిస్తేనే భక్తి వస్తుందని అనుకోరాదు' అన్నాడు మహారాజు.

రాణి తిరిగి మాట్లాడుతూ 'మహారాజా! 'యథా రాజా తథా ప్రజా - అంటారు కదా. మీ భక్తి ప్రవృత్తులు ప్రజలకు తెలియవద్దా? వారికి కూడా స్ఫూర్తి కలుగవద్దా?' అని అడిగింది.

రాజు 'దేవి భక్తి అంటేనే విభక్తిలేనిదని కదా. భగవంతునితో ఐక్యస్థితియే భక్తి. అందులో భక్తుడు తానే కరిగిపోతాడు. అప్పుడు అందులో ఇతరుల మేలుకొరకు అనే అంశరాదు. భక్తుడికి స్ఫూర్తిని కలుగజేసేది కేవలం ఆ భగవంతుడే సుమా! ఇది తెలిసి నెమ్మది వహించుట చేతనే ఈశ్వర సంకల్పం నెరవేర్చినవారమౌతాము' అన్నాడు. అప్పటికి రాణికి 'యదార్థ భక్తి' అంటే ఏమిటో తెలిసింది.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఫిబ్రవరి 2020, మార్చి 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఫిబ్రవరి 2020*** : AS 4166, 5490, 7055, 7058, 7062, 7063, 7678, 7679, 7681, 7990, 7991, 7992, 8000, 8001, 8002

***మార్చి 2020*** : AS 7065, 7086, 7087, 7089, 7094, 7685, 7723, 8011, 8159.


పట్టుదల
మధుప
నేనలా పొలానికి వెళ్ళొస్తా!
1
ఈ ఏడాది బావిలో నీరు బాగా తగ్గిపోయింది. పొలానికి నదినుండి కాలువ తవ్వవలసిందే.
2


ఆ!
ఇక్కడి
నుంచి
మొదలు
పెడతాను
3


ఎలాగైనా ఈ రోజు
ఈ కాలువ పూర్తి
చేయవలసిందే
4


నాన్నా! ఇదిగో అమ్మ భోజనం పంపించింది. చాలా అలసిపోయారు రండి భోజనం చేద్దురుగాని.
5


ఇప్పటికే చాలా పొద్దుపోయింది నాన్నా! త్వరగా భోజనం చెయ్యండి.
6


హమ్మయ్య! మొత్తానికి మన పొలానికి నీరు వచ్చింది. నాకు చాలా ఆకలిగా ఉంది. రా! భోంచేద్దాం.
7


తన పొలానికి నీరు వచ్చేదాకా ఆ రైతు ఎలాగైతే ఆకలిని, అలసటను మరచిపోయాడో అలాగే ఏం సాధించాలన్నా మనకు అంతటి పట్టుదల కావాలి.
8

# సాధనే ముక్తికి మార్గం

- వి. రవి కుమార్

ప్రతి జీవుడు ఒక శరీరాన్ని ఆశ్రయించి, ఆ శరీరమే తాను అనే భావనతో ఉండిపోతూ ఆ శరీరంతో చేసే పాప పుణ్యములకు తానే కర్తృత్వం వహిస్తూ, దాని వలన వచ్చే ప్రారబ్ధానికి బద్ధుడై, సుఖదుఃఖాలను పొందుతున్నాడు. చిత్రమైన విషయమేమిటంటే, అసలు తాను శరీరము కాదు, తనకు భావనలు కల్పిస్తూ, సంకల్ప వికల్పాలకు మూలమైన మనస్సూ కాదు, తను ఆత్మ వస్తువునని ఎవరైతే తెలుసుకుంటారో, వారు ఈ విశ్వభ్రాంతి నుంచి సుఖ దుఃఖాల నుంచి మోక్షం పొంది జీవన్ముక్తులౌతున్నారు.

'జీవన్ముక్తిని పొందటానికి జన్మతోను, శరీరంతోను సంబంధమే లేదు. నీ సాధనే నీకు ముక్తిని కలుగు జేస్తుంది' అని శ్రీసద్గురుదేవులు తమ ప్రసంగాలలో ఎన్నోసార్లు నొక్కి చెప్పారు. అయినా మనం అహంకార, మమకారములకు బంధితులమై సుఖదుఃఖాలను పొందుతూ ఈ కనబడుతున్న మిధ్యా ప్రపంచము శాశ్వతమని భావించి మరల మరల జన్మలు పొందుతున్నాము. దానినే శ్రీ శంకరభగవత్పాదులవారు 'పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం' అని వారి భజగోవిందంలో తెలియజేశారు.

బ్రహ్మజ్ఞానాన్ని పొందటానికి, ముక్తిని పొందటానికి ఆకారంతో సంబంధం లేదు - అని తెలియజేసే కథ ఒకటి ఇప్పుడు మనం తెలుసుకుందాం....

పూర్వం హిమాలయ పర్వతాలకు ఉత్తరం వైపున కర్కటి అనే రాక్షసి ఒకటి వుండేది. ఆమె నల్లని పెద్ద కొండలాంటి ఆకారంతో, పెద్ద పెద్ద కోరలతో భయంకరమైన ఆకారం కలిగి వుండేది. ఆ రాక్షసి ఆకారానికి ప్రజలు 'విషూచిక' అని పేరు పెట్టారు. విషూచిక అంటే కలరా వ్యాధి అనే అర్థం వుంది.

ఈ రాక్షసికి ఎంతమందిని పీక్కుతిన్నా ఆకలి తీరేది కాదు. తనకు ఆనందమూ కలిగేది కాదు. ఒకరోజు దానికి ఒక ఆలోచన వచ్చింది. తాను బ్రహ్మదేవుని గురించి తపస్సు చేసి, అనంత శక్తులను సంపాదించి,

తన కోర్కెలను తీర్చుకోవచ్చనుకుంది. అలాగే వెయ్యి సంవత్సరాలు బ్రహ్మ గురించి తపస్సు చేసింది. బ్రహ్మగారు ప్రత్యక్షమయి వరం కోరుకోమనేసరికి తనకు ఏం కావాలో తానే తేల్చుకోలేకపోయింది. దర్శనమిచ్చిన బ్రహ్మగారు వెళ్ళిపోతారేమో అనే భయంతో ఒక నిర్ణయానికి వచ్చి, 'స్వామీ! నా పేరుకు తగ్గట్టుగా నాకు వ్యాధి రూపం రావాలి, విషూచి అంటే సూది అనే అర్థం కూడా వుంది కనుక నాకు ఆ రూపం కూడా కావాలి' అని కోరుకుంది. బ్రహ్మగారు 'తథాస్తు' అని, 'నీవు రెండు రూపాలు పొందితే జీవులందరిని పీల్చుకుని తినగలుగుతావు కనుక పుణ్యాత్ములను హింసించకుండా వుండటం కోసం నేనొక మంత్రాన్ని తయారు చేశాను. ఈ మంత్రం జపించేవారి జోలికి నువ్వు పోకు' అని చెప్పి అంతర్ధానమైపోయారు.

చూస్తూండగానే కొండలాంటి పెద్ద రాక్షసి రూపం చిన్న సూదిలాగా మారిపోయింది. అది కాక ఆమెకు వ్యాధి రూపం కూడా వచ్చింది. సూదికి నోరు వుండదు, కడుపు కూడా వుండదు కాబట్టి తినలేదు. కాని ఆకలి మానసికమైనది కనుక అది మాత్రం వుండేది.

కొన్ని వేల సంవత్సరాలు తను వ్యాధి రూపంలో పాపాత్ముల శరీరాలలో ప్రవేశించి సూదిలాంటి ఆకారంతో గుచ్చుతూ ఆనందం పొందుతూ వుండేది. కాని సంతృప్తి మాత్రం కలుగనే లేదు. పోను పోను అసంతృప్తి ఎక్కువై మరలా తపస్సు చేయాలని నిర్ణయించుకున్నది. హిమాలయాలలో తపస్సు ప్రారంభించింది. కొన్నివేల సంవత్సరాలు తపస్సు చేస్తుండగా ఆమెలో 'నేనెవరిని' అనే ప్రశ్న ఉదయించింది. అది ఆమెను నిజ జ్ఞానం వైపు నడిపించింది. ఆమె తపస్సు వేడికి సమస్త లోకాలు వేడెక్కి పోతున్నాయి. అప్పుడు దేవతలు బ్రహ్మదేవుడిని ప్రార్థించగా ఆయన మరలా కర్కటికి దర్శనం ఇచ్చారు. కర్కటికి అవయవాలు లేకపోవటం వలన ఆమె మనస్సులోనే అనుకుంది, నేనిప్పుడు సంపూర్ణురాలిని. సందేహాలు లేవు. నాకు మరి వరాలెందుకు? నేను దేనిని తెలుసుకోవాలనుకున్నానో దానిని తెలుసుకున్నాను అని ఆమె మౌనం వహించింది.

-సశేషం

# తిరుప్పావై

సేకరణ - మురళి

**రచన - శ్రీ నందూరి ఆనందమ్మ తల్లి, శ్రీ కృష్ణాశ్రమము**

ఇతరుల దుఃఖం చూసి సహించలేకపోవడం వైష్ణవ లక్షణము. గోదాదేవి వైష్ణవ స్త్రీ అగుటచే, జీవులు ప్రకృతిలోబడి బాధపడటం చూడ లేక, 'నేను పరమాత్మను పొంది ఆనందపడ దలచుకున్నాను, మీరు కూడా రండి. మీరంతా పరమాత్మానుభవమునకు రావాలి!' అని తోటి మానవులందరినీ పిలుస్తోంది. 'సంపత్కరమైన బృందావనంలో వుండే చిన్న గోపికల్లారా! శ్రీకృష్ణుడు విడిచిపెట్టిన పరమపదము వలె కాకుండా, వాడు ప్రేమించి కావాలని అవతరించిన గోకుల బృందావనము కదా! శ్రీకృష్ణ పరమాత్మ అవతారము చాలించిన తరువాత కాకుండా, పరమాత్మ అవతారమునకు పూర్వము కాకుండా, శ్రీబాల గోపాలునితో సమకాలికులై జన్మించిన మీ భాగ్యమే భాగ్యము కదా గోపగోపికల్లారా! వానితో కలసి మురళీ ఊదుతూ, ఆడుకుంటూ వుండే నడి వయస్సుగల బాల గోప గోపికలై జన్మమెత్తిన మీ భాగ్యమే భాగ్యము! పరమాత్మను పొందటానికి అర్హత కలిగిన పవిత్ర జన్మలు కదా మీవి! ఏమి భాగ్యమది!!

ఎవరిని గురించి ఈ నోము చేస్తున్నామంటే, వేలాయుధాన్ని చేతిలో ధరించిన నందగోపునిని కుమారుని గురించి. అంటే తిరు మంత్రమును స్వాధీనము చేసుకున్న సదాచారులకు లోబడి వుండేవాడు శ్రీకృష్ణ పరమాత్మ. ఆ కారణముచే వాడు సర్వస్వతంత్రుడు. మనలను రక్షించునో లేదో అనే భయమక్కర్లేదు. అందమైన నేత్ర సౌందర్యము కలిగిన యశోదమ్మ వద్ద సింహపు పిల్లవలె వుంటాడు. అంటే, నంద గోపుని వద్ద భయము, యశోదమ్మ వద్ద దుడుకుతనము ప్రకటించే వాడు. అష్టాక్షరీ మహామంత్రమైన తిరుమంత్రముచే ప్రకాశించేవాడు!

'కార్ మేనిచ్చెంగణ్ కదిర్ మదియమ్బోల్ ముగత్తావ్' - గ్రీష్మ ఋతువులో మేఘ సందర్శనమెంత తాపహరమో, అలాగే సంసార తాపత్రయాగ్ని చల్లార్చే చల్లని నల్లని శ్రమహరమైన నీలమేఘశ్యాముడు సౌందర్యవంతుడమ్మా! గోపాలుడు సూర్యుని కాంతి చంద్రుని చల్లదనము గల దివ్య ముఖమండలము కలవాడమ్మా! అనగా దుర్యోధనుడు,

రావణుడు మొదలగు దుష్టులు తేరిపార చూడటానికి అశక్యుడు. అర్జున, విభీషణాదులకు అనుభవ యోగ్యమైన చల్లని ముఖపద్మముగల గోపాల కృష్ణుడమ్మా!

ఎన్ని రూపగుణములు వాడికున్ననూ, ఏదో ఒక పేరుతో పిలవాలంటే **'నారాయణే నమక్కే పరైతరువాన్'** నారాయణుడేనమ్మా. ఏ నారాయణ మహామంత్రమున ఈ జీవాత్మకు పరమాత్మ శేషి, శరణ్యుడు, రక్షకుడు, ఆధారము, భర్త, గతి అని చెప్పబడుతున్నాడో, ఆ మంత్రముచేత ప్రతిపాదింపబడిన నారాయణుడేనమ్మా మన గోపబాలుడు. **'నమక్కే పరైతరువాన్'** వాడే రక్షకుడు. మనం చేసిన కర్మ, జ్ఞాన, భక్తులు కాదు భగవానుని పొందడానికి ఉపాయము, ఆ పరమాత్మ వాని పదములు తప్ప వేరు శరణ్యము లేదు. ఆ పాదపద్మములే ఉపాయముగా పట్టి అధ్యవసించిన మనకు వాడు తప్పక కైంకర్యమనే పురుషార్థము కలుగ జేస్తాడు. వానిని నమ్ముకొన్న మనకు వాడు వాని పాదపద్మములలో చేర్చుకుని, 'అహం సర్వం కరిష్యామి' అనే లక్ష్మణస్వామి కైంకర్యమెందుల కీయడు? కనుక మనమంతా ఈ నోములో అన్వయించి ముప్పది రోజులు ఈ ధనుర్మాస వ్రతమును, లౌకికులు కూడా కొనియాడి భక్తులు అయ్యేటట్లు మనము ఆ నోము నోచి ఆనందపడదాము రండి! అని అందరినీ పిలుస్తున్నారు.

***ముఖ్య భావము -***

ఈ జీవాత్మకు ప్రాప్యము వాని కైంకర్యమే. ప్రాపకము వాడేనని, ప్రాప్య, ప్రాపక స్వరూపముల నిర్ణయించుచున్నది ఈ దివ్య పాశురము. మొదటి దినము నందు ప్రాప్య, ప్రాపకములు వాడేనని నిర్ణయించి, రెండవ దినమునందు ప్రాప్య, ప్రాపకములు వాడే అయినప్పటికీ ఈ జీవాత్మ కొన్ని అకార్యములు విడవాలి, కొన్ని మంచి కార్యములు చేయాలి అని నిర్ణయిస్తున్నారు.

-సశేషం

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

**షడంగాది వేదో ముఖే శాస్త్ర విద్యా।**
**కవిత్వాది గద్యం సుపద్యం కరోతి।**
**గురోరంఘ్రి పద్మే మనశ్చే న లగ్నం।**
**తతః కిమ్ తతః కిమ్ తతః కిమ్ తతః కిమ్॥**

'వేదవేదాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసినా, విశేషమైన శాస్త్రజ్ఞానమును కలిగివున్నా, పద్యగద్యాదులను రచించే పాండితీ ప్రకర్షను పొందివున్నా, గురుపాదపద్మముల యందు మనస్సు నిలుప లేకపోయినప్పుడు వాటి విలువ శూన్యమే' అని ఈ శ్లోక తాత్పర్యము. అష్టకములో మూడవదయిన ఈ శ్లోకం శాస్త్ర పరిజ్ఞానము మరియు పాండిత్యాన్ని గురించి ప్రస్తావిస్తుంది.

***షడంగాది వేదో ముఖే శాస్త్రవిద్యా -***

శ్రీబాబూజీ 'భక్తిలేని శాస్త్ర జ్ఞానము వ్యర్థమనీ సాధకుడికి భక్తి విశ్వాసాలు ప్రధానమనీ అవి లోపించినప్పుడు శాస్త్ర పరిజ్ఞానం గ్రంథాలకే పరిమితమౌతుంద'నీ శెలవిచ్చారు. నిజమైన సాధకుడు తాను చదివి తెలుసుకున్న ప్రతి విషయంలోనూ మూలమైన పరమాత్మను దర్శించ గలుగుతాడు.

కృష్ణ భగవానుడు భగవద్గీతలో '***వేదైశ్చసర్వైరహమేవ వేద్యః వేదాన్తకృత్ వేదవిదేవ చా౽హం***' అంటూ 'అన్ని వేదాలను రచించినదీ నేనే, వాటిని స్పష్టంగా అర్థం చేసుకున్నాక కూడా తెలియబడేదీ నేనే' అని శెలవిచ్చారు. శాస్త్ర పరిజ్ఞానం యొక్క పరమార్థము కేవలం వేదవిదుడైన పరమాత్మను తెలుసుకొనటమే. ప్రహ్లాదుడు 'చదివినవి గలవు పెక్కులు, చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!' అని హిరణ్యకశిపుడికి వివరిస్తాడు. మరి ఆ మర్మాన్నీ, మూలజ్ఞానాన్నీ కేవలం గురుకృప ద్వారా మాత్రమే పొందగలుగుతాము. వేదశాస్త్రాలను గురుముఖస్థంగా మాత్రమే నేర్చుకోవాలని అనడంలో అంతరార్థం అదే.

కవిత్వాది గద్యం సుపద్యం కరోతి -

గద్యపద్య కవిత్వాదులలో పేరుగాంచిన కవులు, పండితులు

కూడా ఆ పాండిత్యము పరమాత్మ ప్రసాదితమైన 'విభూతి' అని తమ గొప్పదనమేదీ లేదని వివరించారు. రామోపాసనతో రామాయణాన్ని రచించిన వాల్మీకి విషయంలోగానీ, భగవత్ప్రేరణతో భారత భాగవతాది పురాణేతిహాసాలను అందించిన వ్యాసులవారి విషయంలోగానీ అదే జరిగింది. భాగవతాన్ని ఆంధ్రీకరించిన పోతనామాత్యులు కూడా 'పలికించెడివాడు రామభద్రుండట' అని నిగర్వంతో వెల్లడించారు.

ఈ విధంగా తను తెలుసుకున్న ప్రతి విషయంలోనూ, తనకు ప్రసాదింపబడిన ప్రతి విభూతికీ మూలమైన గురుపరబ్రహ్మను దర్శించాలని ఈ శ్లోకం వివరిస్తోంది.

-సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2020**

1 శని - రథసప్తమి.

5 బుధ - భీష్మ ఏకాదశి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

9 ఆది - మాఘపూర్ణిమ - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

18 మంగళ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

21 శుక్ర - మహాశివరాత్రి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ

**మార్చి 2020**

9 సోమ - పౌర్ణమి - హోళీ - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

18 బుధ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

25 బుధ - శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది. ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ.

# భజ  గోవిన్దమ్

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

**7. బాలస్తావత్ క్రీడాసక్తః, తరుణస్తావత్ తరుణీసక్తః।**
**వృద్ధస్తావత్ చిన్తాసక్తః పరమేబ్రహ్మణికోఽ పిన సక్తః॥**

జీవితం క్షణ భంగురం. సాధనలో చేయాల్సిన యాత్ర సుదూరం. మేఘాల అంచులు దాటి అత్యున్నత స్థితికి ఎదగాలి. వివేక జ్ఞానంతో, నిర్మల హృదయంతో సాధన చేస్తే, అనతి కాలంలోనే పరమార్థ సిద్ధి పొందవచ్చు. కాని అందరూ అలా సంసిద్ధులవరుగా! విషయాదులలో, స్త్రీ వ్యామోహంలో పడి పెడ త్రోవ పడతారు.



వీటిలోనే ఆనందం వుందనుకొంటారు. స్వల్ప సుఖాలలో పడి పతనమయి పోతారు. ఇది "షుగర్ కోటెడ్ పిల్. (చక్కెర అద్దిన చేదు మాత్ర)"

బాల్యం ఆటలతో గడిచిపోతుంది. తరుణావస్థ స్త్రీలపై ఆసక్తితో గడిచి పోతుంది. వృద్ధాప్యంలో కట్టె పట్టుకొనే స్థితిలో, ఏమీ చేయలేని స్థితిలో చింత ఆవరిస్తుంది. కాని అప్పుడుకూడా పరబ్రహ్మను (భగవంతుని) గురించిన విచారణ చేయడు. బాల్యం, యౌవనం, వృద్ధాప్యం - ఇవి ప్రతి మానవుడు దాటే అవస్థలే. పగలు ఆటలతో, యౌవన క్రీడలతో గడుపుతాడు. రాత్రి అయ్యేసరికి చింతలు చుట్టుకుంటాయి. కాని అతడు భగవంతుని వైపు మనస్సు మరల్చడు.

ఈ ప్రపంచ విషయాలపై ఆసక్తిని వీడి వీటి పట్ల వైరాగ్యాన్ని పొందాలి. జీవిత లక్ష్యమైన పరమార్థాన్ని సాధించాలి. వివేక శక్తితో వీటిని అధిగమించాలి.

కొద్దిమంది మాత్రమే భగవంతుని చూడటమే తమ జీవిత లక్ష్యమని గ్రహించగలుగుతారు - శ్రీరామకృష్ణ పరమహంస.

-సశేషం

# మీరేగా అంతా ... మీదేగా అంతా

- పెనుమాక నాగేశ్వరరావు

మీరేగా అంతా, మీదేగా అంతా
అది ఒక తెలియని వింత
చింతే వుండదు మీ చెంత
మిము చూసినంత కలుగును పులకింత
నేనెంత, నా తెలివెంత, నా విద్యెంత, మిధ్యేగా అంతా. ॥మీరేగా॥

మేమ్మీకు చేసే పూజలు గోరంత
మీ అండ మాకు కొండంత
మీ దయ వుంటే భయమే వుండదు రవ్వంత
లేదిందు అతిశయ మిసుమంత
నేనెంత, నా తెలివెంత, నా విద్యెంత, మిధ్యేగా అంతా. ॥మీరేగా॥

ఎంత చెప్పినా మీ చరిత
మిగిలే వుండును ఎంతో కొంత
పంచరాదా మీదయ మాకు పిసరంత
వుంచరాదా మీ అభయం మాపై కాస్తంత
నేనెంత, నా తెలివెంత, నా విద్యెంత, మిధ్యేగా అంతా. ॥మీరేగా॥

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2020**

1  శని - రథసప్తమి

5  బుధ  - భీష్మ ఏకాదశి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

9   ఆది - మాఘపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

18 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

21 శుక్ర  - మహాశివరాత్రి - తె.జా 3-30ని॥ శ్రీబాబుకు బృందావనంలో నమకచమక సహిత రుద్రాభిషేకము; 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, 8గం. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు; మధ్యాహ్నం 12గం. సహస్రఘటాభిషేకము; లక్ష బిల్వార్చన; తీర్థప్రసాదాలు, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారి సామూహిక కళ్యాణాలు, అనంతరం స్వామివారి నగరోత్సవం.

23 ఆది - అమావాస్య

26 బుధ -  ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీస్వామిని వారి ఆరాధన, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

**మార్చి 2020**

7  శని - శనిత్రయోదశి.

9  సోమ - పౌర్ణమి - హోళీ - శ్రీసద్గురుపాదపూజ.

18 బుధ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

22 ఆది - మాసశివరాత్రి

24 మంగళ  - అమావాస్య

25 బుధ - శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది. ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# పతిత పావనుడు

- పాలూరి కాళీ ప్రసాద్

మనం తిరుపతి వెడితే ఎక్కడ చూసినా 'ధర్మో రక్షతి రక్షితః' అనే వాక్యం కనిపిస్తుంటుంది. ధర్మాన్ని ఆచరిస్తూ ధర్మబద్ధంగా జీవించిన వారిని ఆ ధర్మమే రక్షిస్తుంది అని దీని భావం కదా! కొంతమంది దీనినే కొద్దిగా మార్చి పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంలో 'వృక్షో రక్షతి రక్షితః' అని కూడా ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ ధర్మానికి వృక్షానికి మధ్య ఒక వ్యత్యాసం వుంది. ధర్మం తనని ఆచరించిన వాడిని, రక్షించిన వాడిని మాత్రమే రక్షిస్తుందేమో! కానీ, వృక్షం తనకు రోజూ నీరు పోసి పోషించినవారినే కాక, తనను హింసించి నరికివేయాలని వచ్చిన వాడిని కూడా ఆదరించి చల్లని నీడను, ఫల పుష్పాదులను అందిస్తుంది. అది తన వద్దకు వచ్చిన వారిపట్ల ఎటువంటి భేద భావాన్ని చూపించదు.

భగవంతుడు కూడా ఈ వృక్షం లాంటివాడే. ఆయన పతిత పావనుడు. చక్కగా తన ధర్మాన్ని ఆచరిస్తూ లోకోపకారిగా ధార్మిక జీవనం గడిపేవాడిని ఎలా చేరదీసి ఉద్ధరిస్తాడో, ధర్మాధర్మ విచక్షణ లేకుండా తన ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తిస్తూ పతితుడైపోయిన వాడిని కూడా అంతకంటే ఎక్కువ ప్రేమతో చేరదీసి ఉద్ధరిస్తాడు. నిజానికి ధర్మ పరుడికంటే పతితుడే ఆయన యొక్క ప్రేమకు, సహచర్యానికి ఎక్కువగా నోచుకుంటాడేమో! తల్లికి తన పిల్లలందరిపైనా ఒకే రకమైన ప్రేమ వున్నా కూడా చక్కగా వృద్ధిలోకి వచ్చిన పిల్లవాడికంటే ఎందుకూ పనికిరాని పిల్లవాడి పట్ల ఇంకా ఎక్కువ బాధ్యత, ఆసక్తి చూపిస్తుంది కదా!

సంపూర్ణంగా ఆరోగ్యంతో వున్నవాడు తన దగ్గరకు వస్తే, వైద్యుడు ఊరికే రెండు నిమిషాలు చూసి పంపించేస్తాడు. రోగి ఎంత ఎక్కువ అనారోగ్యంతో బాధపడేవాడైతే వైద్యుడు ఆ రోగితో అంత ఎక్కువ సమయం గడుపుతాడు కదా! అలాగే ఒక ఉపాధ్యాయుడు తన తరగతిలో బాగా చదువుతూ, చెప్పినవన్నీ చక్కగా అర్థం చేసుకుంటూ, మంచి మార్కులు తెచ్చుకునే విద్యార్థిని చూసి సంతోషిస్తాడే కానీ, రోజులో తన సమయాన్ని ఎక్కువగా ఎవరికి కేటాయిస్తాడు? మందబుద్ధి అయిన విద్యార్థికే కదా! రజకుడు శుభ్రంగా వున్న వస్త్రాన్ని ఊరికే పిండి ఆరేస్తాడు కానీ, బాగా మురికి పట్టివున్న వస్త్రాన్ని ఎంతోసేపు

కష్టపడి వుతుకుతాడు కదా! భగవంతుడి ముఖ్య కర్తవ్యం కూడా అదే. భక్తుడూ, జ్ఞానియైన వాడు ఎలాగైనా తన దగ్గరకే చేరుతాడు. కానీ, తనని తెలుసుకోలేక, అసలు గుర్తించక అధోగతి పాలయ్యేవాడి కోసమే ఆయన ఎక్కువ సమయం కేటాయిస్తాడు.

అప్పటికే తనకు పెద్ద రోగం వున్నదని పరీక్షల ద్వారా నిర్ధారించుకుని స్పెషలిస్ట్ డాక్టర్ దగ్గరకు వెళ్లిన రోగి ఆయన ఇచ్చిన మందులు చక్కగా వాడి, చెప్పిన పథ్యం పాటించి క్రమశిక్షణతో తన రోగాన్ని నయం చేసుకుంటాడు. కానీ, తనకు ఒక రోగం వున్నదనే విషయం కూడా తెలియకుండా తన యింట్లో తాను స్వేచ్ఛగా బ్రతికేస్తున్న వాడిపై ప్రేమతో ఆ ఇంటి ఫ్యామిలీ డాక్టరు మాటిమాటికి ఇంటికి వస్తూ అతనికి పథ్యం చెబుతూ, తగిన మందులు ఇస్తూ, అతను రోగం విషయం తెలియక తన వైద్యాన్ని శ్రద్ధతో పాటించకపోయినా, తన మాట వినకపోయినా ఏమాత్రం విసుగులేకుండా అతనికి పూర్తి స్వస్థత చేకూరే వరకు తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే వుంటాడు.

సరిగ్గా అటువంటి ప్రేమమూర్తే భగవంతుడు. తమకు భవమనే రోగమున్నదని తెలుసుకోలేక, అసలు భగవంతుని గుర్తించక, ఒకవేళ గుర్తించినా శాస్త్ర, లోక వాసనలతో కొన్ని కొన్ని మూఢాచారాలకు అలవాటుపడి, వాటిని పాటించటమే భగవంతుని ఆరాధనగా పొరబడుతూ, కులమత దురహంకారాలతో సాటి మానవులలోని భగవంతుని చూడలేక, వారిపట్ల దారుణమైన వివక్షత చూపుతూ, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగలేక పతితులైపోతున్న మానవాళిని ఉద్ధరించడానికి మాటిమాటికి ఎందరో గురువుల, మహాత్ముల రూపంలో అవతరిస్తూ, ఆ పతితుల మధ్యలోనే నివశిస్తూ, వారి యిండ్లలో తిరుగుతూ, తింటూ, వారిలో ఒకరిగా వుంటూ మెల్లమెల్లగా వారిలో పరివర్తన కలిగించి నిజమైన ఆధ్యాత్మిక మనో వికాసాన్ని కలిగించి, వారిని ఉద్ధరించడానికే తన అవతార కాలాన్నంతా ధారపోసే పతితపావనుడు భగవంతుడు! ఇందుకు ఉదాహరణలు సమర్థసద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్ వారి దివ్య చరిత్రలో కోకొల్లలుగా కనిపిస్తాయి. మన జీవిత సర్వస్వాన్ని వారి పాదాల చెంత ధారపోసినా వారి ఋణంలో లక్షోవంతు కూడా తీర్చుకోవడం అసాధ్యం!

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

శ్రీమాతాజీవారు కైవల్యోపనిషత్‌లోని 11వ మంత్రం వివరిస్తూ ఈ విధంగా చెప్పారు : ఈ మంత్రంలో సాధకుడు ఆత్మానుభూతిని తనలో వున్న ఆత్మ సర్వభూతములలో వున్నట్లుగాను, సర్వభూతములు తనలో వున్నట్లుగానూ చూడటమనేది ఒకవేళ పొందలేకపోతే అటువంటి ఆత్మానుభూతిని ఎలా పొందగలుగుతాడో ఈ మంత్రంలో చెబుతున్నాడు బ్రహ్మదేవుడు.

జీవాత్మ భావనను క్రింది అరణిగాను, ప్రణవమును ఉత్తరారణి గాను చేసి జ్ఞానమార్గమునందు మథించి, అభ్యాసము చేసిన పండితుడు (జ్ఞాని) ఆ జ్ఞానం ద్వారా సమస్త బంధములను దహింప చేసుకుంటున్నాడు. ఈ మార్గములో సాధకుడు చేసేది ధ్యాన యజ్ఞం. ధ్యానం చేయాలంటే మనలో వున్న విషయాదులు ముందు పలాయనం చిత్తగించాలి. ఈ ధ్యాన ప్రక్రియను యజ్ఞ యాగాదులలో 'అరణిలో అగ్నిని పుట్టించడం' అనే ఉదాహరణ ద్వారా వివరిస్తున్నారు. దీనినే అగ్ని మథనం అంటారు.

మనలో వున్న జీవుడు ధ్యానానికి ఉపక్రమించినప్పుడు, ముఖ్యంగా మానసిక విక్షేపాలను, చిత్తంలో అశాంతిని అనుభవిస్తున్నాడు. ఈ అభ్యాసాన్ని మొదట మహాత్ముల సన్నిధిలో చేసుకోవాలి. ధ్యానానికి కూర్చున్నప్పుడు మథనం జరుగుతూ వుంటుంది. ఎన్ని విక్షేపాలు వచ్చినా మనం తప్పకుండా మన ఆశయాన్ని చేరుకుంటాం. ఇది కేవలం మహాత్ముల సన్నిధిలో సాధ్యమవుతుంది. ఎందుకంటే ఇది విషయాదులతో కూడిన ప్రపంచంలో (బజారులో) సాధ్యపడదు. ఈ ప్రక్రియను ఈ అగ్ని మథనాన్ని ఈ విధంగా వివరించారు ....

చెక్కతో రెండు గిన్నెలవంటివి తయారు చేస్తారు. వాటిని ఒకదాని మీద మరొకటి బోర్లిస్తారు. వాటి మధ్య ఒక రంధ్రం వుంటుంది. ఆ రంధ్రం ద్వారా ఒక పొడవాటి చెక్కను దూర్చి, దానికి తాడుకట్టి పెరుగును చిలికినట్లు చిలుకుతారు. ఆ రాపిడికి చెక్క వేడెక్కి నిప్పు రవ్వలు పైకి వస్తాయి.

ఈ పైన చెప్పిన ఉదాహరణను తీసుకుని మనలో జరిగే ధ్యాన

(జ్ఞాన) మథనాన్ని వివరిస్తున్నారు. క్రింది గిన్నె మనలోని జీవుడు (అరణి) పైగిన్నె ప్రణవము (ఓంకారము) అది పరమాత్మకు శబ్ద ప్రతీక (ఉత్తరారణి). ఈ రెండూ కలిసినప్పుడు ధ్యాన మననాదుల ద్వారా ప్రకృతి భావనతో, దేహ భావనతో బంధింపబడిన జీవుడు పరమాత్మ స్థితికి ఉద్ధరింప బడతాడు. అప్పుడు ఈ దేహాదులతో కూడిన తాదాత్మ్య భావన వదులు కుంటాడు. ఇటువంటి ధ్యాన మథనాభ్యాసాన్ని సాధకుడు కొంతకాలం మహాత్ముల సన్నిధిలో వుండి చేయాలి. అలా చేస్తే తనలో వున్న శక్తి సామర్థ్యాలను తెలుసుకుంటాడు. ఆ జ్ఞానంతో మన మనస్సులో ఈ మథనం చేస్తే జ్ఞానాగ్ని రగులుకుని, ఈ బంధాలను అన్నింటిని భస్మం చేస్తుంది. అప్పుడు జ్ఞాని (పండితుడు) ఈ పాశ బంధాలన్నింటినీ దహించి వేస్తాడు.

బ్రహ్మచర్యాశ్రమంలో వున్నవారు, గృహస్థాశ్రమంలో వున్నవారు ఈ విధంగా అభ్యాసం చేస్తే లక్ష్యం కుదిరి వారి గమ్యస్థానాన్ని చేరుకుంటారు. గృహస్థుల జీవితం, బ్రహ్మచర్యుల జీవితం గురించి శ్రీ గురుదేవులు ఒక చక్కటి ఉపమానంతో వివరించేవారని శ్రీమాతాజీ తెలియజేశారు. సన్న్యాసాశ్రమం స్వీకరించిన బ్రహ్మచారికి కొన్ని ధర్మాలు వుంటాయి. అవి అతిక్రమిస్తే జీవితం పతనం అవుతుంది. అంటే మనస్సు చలిస్తే. సన్న్యాసాశ్రమ జీవితాన్ని గోదావరి బ్రిడ్జి మీద వెడుతున్న రైలుతో పోల్చారు. అప్పుడుగనుక ఆ రైలు పట్టాలు తప్పితే క్రిందనున్న నదిలో పడిపోతుంది. గృహస్థాశ్రమంలో వున్న సాధకుడి జీవితం రాజమండ్రి స్టేషన్ చేరుకుంటున్న రైలుతో పోల్చారు. అది పట్టా తప్పితే మళ్ళీ రైలును జాకీతో ఎత్తి పట్టామీదకు ఎక్కించ గలుగుతారు. అలాగే ఒకవేళ ఆ గృహస్థ సాధకుడికి ఇంద్రియాల ప్రేరేపణతో మనస్సు చలించినా, ధర్మబద్ధంగా ఆ కోర్కెలను తీర్చుకోవచ్చు. గృహస్థుడికి కూడా కొన్ని ధర్మాలు వుంటాయి. వాటిని అతిక్రమించకుండా ప్రపంచంలో ఎంతవరకూ వుండాలో (తన కర్తవ్యాన్ని ధర్మబద్ధంగా నిర్వహిస్తూ) అంతవరకూ వుండాలి' అని శ్రీమాతాజీ వివరించారు.

-సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## విశ్వనాధం మావయ్యతో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

ఈ విషయం ఆ తరువాత మామయ్య శ్రీ బాబుతో చెప్పినప్పుడు, శ్రీ బాబు నవ్వుతూ "నాకు నీ సంగతీ, చిరంజీవి సంగతీ తెలియకుండానే బుట్టెడు తొనలూ నీ చేతికి అప్పగించాననుకున్నావా మామయ్యా? అక్కడికీ నీకు ముందుగా పెట్టిన తరువాతనే పంపాననుకో! అయినా మనకి అదొక లెఖ్ఖా! " అన్నారు. "అంతేనంటావా?" అన్నారు మామయ్య. శ్రీ బాబు 'అమ్మ పుట్టింటిని గురించి మేనమామకు చెప్పాలా మామయ్యా?' అన్నారు. ఇద్దరూ నవ్వుకున్నారు.



అందరిలో ఉన్నపుడు తన ప్రియ పుత్రునికి ఎక్కడ నరదృష్టి సోకుతుందో అని, శ్రీ బాబు అందరితో బాటుగానే మామయ్యకు కూడా వడ్డన చేయించే వారు. కాని మామయ్యకు పులిహోర, పూర్ణాలు, గారెలు మొదలైనవి చేసిన రోజున, ఆయనకు విడిగా ఒంటరిగా పెట్టి దగ్గరుండి తినిపించేవారు.

పండగలలోగాని, యితర ప్రత్యేక యజ్ఞ యాగాది కార్యక్రమాలలో గాని ఎంత మందికి భోజనం పెడితే అంత ఆనంద పడిపోయే వారు శ్రీ బాబు. అంతమంది జనుల రూపంలో ప్రకాశించే ఆ విరాట్ స్వరూపునికి మనం సమర్పించే నివేదనా రూపమైన ఆరాధనమే సమారాధన (సమ్యక్ + ఆరాధన) అని, అదే సంపూర్ణమైన ఆరాధన అవుతుందని స్వామి చెప్పేవారు. శ్రీబాబు తమ నివేదనలో స్వీకరించే ఏ పదార్థమైనా అతి స్వల్పంగా ఉండేది. కాని 'వైశ్వానర' రూపంలో సకల జీవ కోటిలోనూ వుండి స్వీకరించే పదార్థమంతా తమకుచేరే నివేదనే అనే విశ్వాత్మ భావన కలవారు మహాత్ములు.

**అహం వైశ్వానరో భూత్వా। ప్రాణినాం దేహ మాశ్రిత:।**
**ప్రాణాపాన సమాయుక్త:। పచామ్యన్నం చతుర్విధం॥**

(భగవద్గీత)

శ్రీకృష్ణుని వద్ద వసంతకుని వలె, శ్రీ బాబు వద్ద విశ్వనాథం మామయ్య సంచరించే వారు. ఉన్నపుడు భయభక్తులతోనూ ఉండేవారు. కాని ఎప్పుడో తమకు తెలియకుండానే సహజమైన చనువూ చూపించే వారు. ఆంతర్యం తెలిసిన శ్రీ బాబు హర్షించి ఊరుకునే వారు.

ప్రతి పెద్ద పండుగకు మామూలుగా జరిగే పూజల అనంతరం శ్రీ సద్గురు పాదపూజ జరిగేది. శ్రీ గురుదేవులు పూజకు విచ్చేయటానికి సిద్ధమవుతున్నపుడు, వారి సన్నిధిలో పురుష సూక్తము, శ్రీ సూక్తము మొదలైనవి పఠిస్తూ మామయ్యా, తారకంగారూ, నేనూ ఉండే మహదవకాశం లభించేది. ఆ సమయంలో స్వామి నిష్ఠలో ఉండే వారు. మేము అత్యంత జాగరూకులమై మసలుకునే వాళ్లము. ఎప్పుడైనా స్వామి వారంతట వారే ఏదైనా మాట్లాడిస్తే అప్పుడు మాత్రమే మాకు పెదవి కదిపే అవకాశం ఉండేది.

ఒకసారి శ్రీ దేవీ శరన్నవరాత్రి పూజల అనంతరం శ్రీ సద్గురు పాదపూజ సందర్భంలో, స్వామి పూజకు సిద్ధమవుతూ భస్మధారణ చేస్తున్న సమయంలో మేము మృత్యుంజయ మంత్రం పఠిస్తున్నాము. ఉన్నట్లుండి మామయ్య 'బాబూ!' అని ఏదో పలకరించబోయారు. శ్రీ బాబు ఆయన వంక తీక్షణంగా చూసేసరికి, పూర్వానుభవం గుర్తుకు వచ్చి, రెండు చేతులతోనూ నోరు మూసుకున్నారు.

స్వామి సిద్ధమైన తరువాత మామయ్యతో 'మామయ్యా! నేను నిష్ఠలో ఉన్నపుడు మాట్లాడకూడదని కూడా తెలియదా? ఆ సమయంలో ప్రశాంతతకు ఏ మాత్రం భంగం కలిగినా, పరిణామం ఎలా ఉంటుందో నేను చెప్పలేను. ఇదివరకు ఒకసారి నీవు ఇలాగే చేశావు. గుర్తుందా?' అన్నారు. మామయ్య లెంపలు వేసుకుంటూ 'గుర్తులేకేం బాబూ! బత్తాయి కాయ విసరటం కూడా గుర్తుంది. అందుకే యిప్పుడు నువ్వు కళ్లెర్ర చేసేసరికి మాట్లాడకుండా నోరుమూసుకున్నాను' అన్నారు. శ్రీ బాబు నవ్వుతూ 'మామయ్యా! నీకెప్పుడు బుద్ధి వస్తుంది?' అన్నారు. మామయ్య శ్రీ బాబు దగ్గరకు  జరిగి, వారి రెండు చేతులూ పట్టుకుని వారి కళ్లలోకి చూస్తూ 'ఈ జన్మలో వస్తుందంటావా బాబూ?' అన్నారు. శ్రీబాబు మామయ్యను వాటేసుకుని ఒకటే నవ్వు!

'మడి' పేరుతో గాని, కులం పేరుతో గాని ఎటువంటి పట్టింపులూ పెట్టుకోక, ఎక్కడ ఎలా తటస్థ పడితే అలాగే సరిపెట్టుకోవటం మామయ్యకున్న మరొక ప్రత్యేకత. ఆ విషయంలో సాటి బ్రాహ్మణ్యం గాని, తదితరులు గాని ఆయనను తప్పు పట్టినా, శ్రీ బాబు మాత్రం చాలా అభినందించేవారు.

మామయ్యగారి ధర్మపత్ని చాల నిష్ఠాపరురాలు. ఆచార వ్యవహారాలలో ఆమె ఏ మాత్రం రాజీపడే వారు కాదు. అందుకని మామయ్య యింటి వద్ద మాత్రం ఆమెకు అనుకూలంగానే సంచరించే వారు. ఆమె కూడా మామయ్యను చాలా ప్రేమగా అభిమానంగా చూసుకొనేవారు. అందువలననే మామయ్య బయట ఎలా సంచరిస్తున్నారనేది ఆమెకు కర్ణాకర్ణిగా తెలుస్తున్నా పట్టించుకోనట్లుండే వారు.

శ్రీ బాబు అప్పుడప్పుడు ఛలోక్తిగా "మామయ్యా! నువ్వు యిలా ఎవరిళ్ళలో పడితే వారిళ్ళలో భోజనం చేస్తున్నావని నీ విషయమంతా మా అత్తయ్యకు చెప్పేస్తాను" అనే వారు. మామయ్య వెంటనే బ్రతిమాలుతున్నట్లుగా శ్రీ బాబు చేతులు పట్టుకుని "వద్దు బాబూ! ఆ పని మాత్రం చెయ్యకు. నీకు పుణ్యం ఉంటుంది. పాపం ఆ పిచ్చిది యిప్పటి దాకా నేను చాలా 'మడి' కట్టుకున్నవాణ్ణి అనుకుంటోంది" అన్నారు. శ్రీ బాబు నవ్వుతూ "మా అత్తయ్య పిచ్చిదేమీ కాదు. ఏదో నీ మీద ప్రేమ చేత, నీ సంగతంతా తెలిసినా తెలియనట్లు సరిపెట్టుకుంటున్నది. ఆమెకు ఏమీ తెలియదనుకుంటున్న నువ్వే పిచ్చివాడివి" అన్నారు. మామయ్య "పోనీలే బాబూ! మమ్మల్నిద్దర్నీ ఎవరి పిచ్చిలో వాళ్ళని యిలా ఉండనీ" అనే వారు.

నిజానికి అత్తయ్య కూడా ఆచార వ్యవహార విషయాలలో సరిపెట్టుకోలేనందువలన శ్రీ బాబు వద్దకు వచ్చి ఎక్కువగా ఉండలేక పోయినా, శ్రీ బాబు యెడల ఆమెకు యెనలేని భక్తీ గౌరవమూ వుండేవి. అందువలననే, మామయ్య శ్రీ బాబును నమ్ముకుని ఉన్నందుకు ఆమె చాలా సంతోషపడేది.

-సశేషం

విష్ణు  కథలు

# శ్రీ శంకర భగవత్పాదులు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

రాజు శరీరంలో ఉన్న శంకరుడు ఒక నెలరోజుల పాటు రాజ్యపాలన చేస్తూ, రాజపత్నులతో కూడి కామ రహస్యాలు అన్నీ తెలుసుకున్నాడు. మంత్రులు అతని చేష్టలు చూసి, మాటలు విని అతడు తమ రాజు కాడని, ఎవరో పరకాయ ప్రవేశం చేసిన మహాపురుషుడని గ్రహించారు. అతడిని తిరిగిపోనీయ రాదని నిశ్చయించుకుని, రాజ్యంలో ఎక్కడైనా అంత్యక్రియలు జరగని శవం కనబడితే దాన్ని దగ్ధం చేయమని రాజభటులను నలుదిక్కులకూ పంపారు. భటులకు ఒకచోట కొండ గుహలో ఒక మృతదేహమూ, దానిని భద్రంగా కాపాడుతున్న సన్యాసులూ కనపడ్డారు. రాజభటులు ఆ సన్యాసులను తరిమివేసి ఆ శవాన్ని తగలబెట్టటానికి ప్రయత్నించారు. తన శరీరం కొంత కాలగానే శంకరుడికి పూర్వ స్మృతి కలిగి తక్షణం రాజు శరీరం వదిలి తన శరీరంలోకి ప్రవేశించాడు. "లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబం" అంటూ నృసింహదేవుడిని ప్రార్థించాడు. కొంత కాలిన దేహం యధాప్రకారం అయింది.



శంకరుడు గగన మార్గంలో మహిష్మతీ నగరానికి వచ్చి ఉభయభారతి అడిగిన కామశాస్త్రంలోని ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఆమెను వాదంలో ఓడించాడు. మండనమిశ్రుడు షరతు ప్రకారం సురేశ్వరాచార్యుడు అనే పేరుతో సన్యాసం స్వీకరించాడు.

**శంకరపీఠాలు :**

శంకరుడు తిరిగి దేశాటనం చేస్తూ అనేక మతస్థులను వాదంలో ఓడిస్తూ అద్వైత మతాన్ని దేశమంతా స్థాపించాడు. దేశంలో నాలుగు దిశలలో నాలుగు

పీఠాలు స్థాపించాడు. ఉత్తరాన బదరీనాథ్‌లో జ్యోతిపీఠం, పశ్చిమాన ద్వారకలో కాళికా పీఠం, తూర్పున పూరీజగన్నాథంలో గోవర్ధన పీఠం, దక్షిణాన శృంగేరీలో శారదా పీఠం అలా నాలుగు పీఠాలు వెలిశాయి. శంకరుడు స్థాపించిన పీఠాలలో శంకరాచార్య పేరుతో పీఠాధిపతులు కొనసాగుతున్నారు.

శంకరుడు దేశాటనలో ఉండగా తల్లి ఆర్యాంబ అవసాన దశలో ఉందని గ్రహించి ఆకాశ మార్గాన కాలడి చేరుకున్నాడు. తల్లి తన పుత్రుని కడసారి చూచి తృప్తిగా కన్ను మూసింది. సన్న్యాసులకు కర్మాధికారం లేదు. అయినా తల్లికి ఇచ్చిన మాటకోసం సంప్రదాయాన్ని ధిక్కరించి ఆమెకు తన చేతులమీదుగా అగ్ని సంస్కారం చేశాడు.

**కాపాలికుడు :**

ఆచార్యుల వారి వద్దకు ఒకనాడు ఒక కాపాలికుడు వచ్చాడు. వారిది వామాచార ఉపాసనా పద్ధతి. శంకరులు వామాచారాన్ని ఖండించారు. శంకరుడిని లోకం నుండి తొలగించాలని ఒక పన్నాగం పన్ని ఒక కాపాలికుని శంకరుల వద్దకు పంపారు.

శంకరులు ఏకాంతంగా ఉన్న సమయంలో ఆ కాపాలికుడు "స్వామీ! నేను కపాలిని ఉపాసిస్తున్నాను. నాకు అష్టసిద్ధులు రావాలంటే పట్టాభిషిక్తుడైన మహరాజును, లేదా ఆత్మజ్ఞానిని బలి ఇవ్వాలి. అప్పుడు కపాలి ప్రసన్నురాలై నాకు సిద్ధులు ప్రసాదిస్తుంది. మహారాజు దగ్గరకు పోయి నా కోర్కెను తెలియచేస్తే నా తల ఎగిరి పోతుంది. మీరు కరుణాసాగరులు, ఆత్మవేత్తలలో మీరు అగ్రగణ్యులు. నా మనోరథం మీ ద్వారా నెరవేరుతుందని మీ సన్నిధానానికి వచ్చాను." అన్నాడు.

-సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD